క్లుప్తంగా

నేడు రేషన్ కార్డుల పంపిణీ

వాజేడు: మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని లబ్ధిదారులకు రేషన్ కార్డులను నేడు (శనివారం) పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరుకానున్నట్లు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

ములుగు రూరల్: ఓపెన్ టెన్త్ ప్రవేశాలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మధ్యలో బడి మానేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల అయిందని ఈనెల 31 వరకు ఎలాంటి రుసుం లేకుండా అడ్మిషన్ పొందవచ్చని అన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల అసిస్టెంట్ కోఆర్డినేటర్ సతీస్ కుమార్‌ను సంప్రదించాలని తెలిపారు.

22న 'చలో గన్‌పార్క్'

వెంకటాపురం(ఎం): ఉద్యమకారుల హక్కుల సాధన కోసం ఈనెల 22న చలో గన్‌పార్క్ నిర్వహిస్తున్నట్లు టీయూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ఉద్యమకారుల హక్కుల సాధన కోసం నిర్వహించే కార్యక్రమాన్ని తరలిరావాలన్నారు. జిల్లాలోని ఉద్యమకారులంతా గన్‌పార్క్ వద్దకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇసుక లారీల సీజ్



ఇసుక లారీని సీజ్ చేస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఎస్సై కొప్పుల తిరుపతి రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వీరభద్రవరం వే బ్రిడ్జి వద్ద ఇసుక లారీలను తనిఖీ చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గొల్లగూడెం ఇసుక ర్యాంప్, యాకన్నగూడెం ఇసుక ర్యాంప్ నుంచి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న రెండు ఇసుక లారీలను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పీఎస్సై సాయి కృష్ణ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు..



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

ఏటూరునాగారం: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ శాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఉచిత ఇసుకను పంపిణీ చేయడానికి గాను మానసపల్లిలోని వాగు తీరంలో ఇసుక నిల్వలను పరిశీలించామన్నారు. కాగా, ఇక్కడి నుంచి ఇసుకను ఎవరూ తరలించొద్దని గతంలోనే తెలిపామన్నారు. అయినా కొంత మంది ఇసుకను తరలిస్తుండగా సిబ్బంది పట్టుకొని కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల రుసుం విధించినట్లు తెలిపారు. ఎవరైనా ఇసుకను తరలించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు.

నియామకం



జయాకర్‌ను సన్మానిస్తున్న పురుషోత్తం గౌడ్

ములుగు రూరల్: జర్నలిస్టు యూనియన్ స్టేట్ జనరల్ సెక్రెటరీగా జయాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంగౌడ్ నియామక పత్రం అందజేశారు. అనంతరం జయాకర్‌ను సన్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి రంజిత్, హరినాథ్, భిక్షపతి, మహేందర్ తదితరులు ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి

ములుగు రూరల్: జగిత్యాల జిల్లాలో వెల్లటూరు మండలం కిషన్‌రావు పేట గ్రామానికి చెందిన మల్లేశ్ అనే యువకుడిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం ప్రవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రేమించిన యువతిని కాపురానికి తీసుకువెళ్లేందుకు వచ్చిన యువకుడిని యువతి తండ్రి కుటుంబ సభ్యులు కత్తితో దాడి చేసి హత్య చేశారని అన్నారు. తక్కువ కులం కావడంతోనే హత్య చేశారని ఆరోపించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- పెడచెవిన పెడుతున్న ప్రజలు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు(ఫైల్)

వెంకటాపురం(కె): మండలంలోని యువత డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా వాహనాల మీద రయ్... రయ్.. మంటూ తిరుగుతున్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని, ఇస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు నిరంతరం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు రహదారులపై తనిఖీలు నిర్వహిస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా పోలీసుల హెచ్చరికలను ఎవరూ పట్టించుకోవడం లేదు. మైనర్లు మితి మీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాల భారిన పడుతున్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపితే కేసులు పెట్టి జరిమానాలు విధిస్తామని పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించిన ప్రజలు పెడచెవిన పెడుతున్నారు. అంతే కాకుండా యువత త్రిపుల్ రైడింగ్‌తో వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పోలీసులు ఎన్ని తనిఖీలు చేసిన, అవగాహన సదస్సులు నిర్వహించిన ప్రమాదాలను మాత్రం నివారించలేకపోతున్నారు. ప్రమాదాల నివారణకు పోలీసులు ఇంకా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా మైనర్లు ద్విచక్రవాహనాలు నడపకుండా చూడాలని తెలుపుతున్నారు.

వేగాన్ని అదుపు చేయాలి



యువత ద్విచక్ర వాహనాలపై త్రిపుల్ రైడింగ్ చేస్తు మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. పోలీసులు వేగాన్ని అదుపు చేయాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలి. మండల కేంద్రంలో వాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయి. అదుపు తప్పితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– ప్రసాద్, బీజేపీ సీనియర్ నాయకుడు

పట్టుబడితే కేసులు



ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి. మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపొద్దు. మైనర్లు బైక్‌లు నడపతూ పట్టుబడితే స్టేషన్‌కు పిలిపించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వాహనదారులు త్రిపుల్ రైడింగ్, డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తున్నాం.

– కొప్పుల తిరుపతిరావు, ఎస్సై

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

- మంత్రి సీతక్క



చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ సీతక్క అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందిన పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్థికంగా భరోసా ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింత నిప్పుల భిక్షపతి, పొడాల ఓంప్రకాశ్, బోడ సతీష్, ఒజ్జల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్రబెల్లి మనోజ్ తండ్రి చక్రధర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా, చక్రధర్‌ను హనుమకొండలోని వారి నివాసంలో మంత్రి సీతక్క పరామర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్ ఉన్నారు.

క్షయ వ్యాధిని తరమికొడదాం..

- డాక్టర్ అభినవ్



పరీక్షలకు వెళ్తున్న వారితో వైద్యసిబ్బంది

కన్నాయిగూడెం: క్షయ వ్యాధిని కలిసికట్టుగా తరమికొడదామని డాక్టర్ అభినవ్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అభినవ్ మాట్లాడుతూ.. మండలంలోని టీబీగ్రాస్తులను గుర్తించి ఏటూరునాగారానికి ప్రత్యేక వాహనంలో పరీక్షల నిమిత్తం తరలించినట్లు తెలిపారు. అనంతరం వారికి అవగాహన కల్పించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమీృష, లక్ష్మణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల నిర్వహణలో అవినీతి

- సామాజిక తనిఖీలో వెలుగు చూసిన వైనం



ప్రజా వేదికలో సామాజిక తనిఖీ నివేదికలను చదివి వినిపిస్తున్న డీఆర్పీలు

మంగపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ భద్రు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. 2024 ఏప్రిల్ 01 నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలోని 25 గ్రామపంచాయతీల పరిధిలో 349 పనులకు రూ.3,60,54,796 ఈజీఎస్, రూ.2,59,85,262 పంచాయతీ రాజ్ నిధులతో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీల వివరాల నివేదికలను ఓపెన్ ఫోరంలో డీఆర్‌పీలు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు వ్యవహరించడంతో సుమారు రూ.11 లక్షలకు పైగా అవినీతి అక్రమాలు జరిగాయని గుర్తించి వెల్లడించారు. మస్టర్లు లేకుండా 05 గ్రామ పంచాయతీల్లో రూ.4 లక్షల చెల్లించినట్లు తెలిపారు. క్రీడా ప్రాంగణాల్లో నిబంధనలకు విరుద్ధంగా రూ.లక్ష అదనంగా చెల్లింపులు జరిగాయని రికార్డుల్లో ఎంపీడీఓ, ఏపీఓ సంతకాలు లేకుండా పనులు చేయడం, చెల్లింపులు చేయడం, ఒక్కో పంచాయతీలో వేలల్లో మొక్కలు నాటినట్లు రికార్డుల్లో ఉన్నా.. 20 శాతం మొక్కలు కూడా కనిపంచలేదని రికార్డులను చూపించారు. రూ.లక్షల్లో అవినీతికి పాల్పడినట్లు తేటతెల్లం అవుతున్నా వారిపై చర్యలు తీసుకోకుండా నామమాత్రంగా ఫెనాల్టీ విధించి ప్రోత్సహిస్తున్నారని అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 గ్రామపంచాయతీల పరిధిలో సుమారు రూ.12 లక్షలకుపైగా అవినీతి జరిగినట్లు డీఆర్పీలు వెల్లడించినప్పటికి పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, టీఏలు సిబ్బందికి రూ.86,896 ఫెనాల్టీ, రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ప్రెసిడింగ్ ఆఫీసర్ ఏపీడి వెంకటనారాయణ, విజిలెన్స్ అధికారి సాంబయ్య, క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరంసింగ్, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, సోషల్ ఆడిట్ ఇన్‌చార్జ్ స్వామి, ఈజీఎస్ ఏపీఓ అంకూస్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి యమున



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి మనోజ్

- వైద్యాధికారిణి యమున

మంగపేట: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి యమున అన్నారు. మండలంలోని రమనక్కపేటలో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న ఇద్దరిని గుర్తించి వారికి రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని మాట్లాడుతూ.. పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ప్రజలు వర్షాకాలం ముగిసే వరకు జాగ్రత్తలు తప్పక పాటించాలని తిమ్మంపేట పల్లె దవాఖాన వైద్యాధికారి చంద నరేష్ అన్నారు. మండలంలోని మంగపేట పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మంపేట బీసీకాలనీలో వైద్యాధికారి చంద నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం, ఒంటి నొప్పులు, జలుబుతో బాధపడుతున్న 20 మందికి ఆర్‌డీటీ పరీక్షలు చేశారు. అందులో ముగ్గురికి డెంగీ పాజిటీవ్ రావడంతో వెంటనే వారిని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. వేడి వేడి ఆహారాన్ని తినాలని సూచించారు. దోమతెరలు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్‌ఎం లలిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాజేడు: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల సమయంలో గ్రామల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల బాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోగిల బాలు మాట్లాడుతూ.. కళాశాల సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో చదువుకోవడానికి విద్యార్థులు రాలేకపోతున్నారన్నారు. అలాగే విద్యార్థులకు ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాకేశ్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీని నిలిపివేయాలి



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుల ఆకస్మిక బదిలీ నిలిపివేయాలని ఎంఈఓ మల్లయ్యకు విద్యార్థుల తల్లిదండ్రులు అలువాల శ్రీనివాస్, రంజిత్ శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రవేశ సమయంలో ఉపాధ్యాయులను బదిలీ చేయడంతో విద్యకుంటూ పడే అవకాశం ఉందన్నారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇప్పటికే ఉపాధ్యాయుల కొరత ఉందని వీలైతే ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలను నిలిపివేయకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గణపురం: లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం గణపురం మండలంలోని చెల్పూరు గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను, కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన గత పాలకులు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలను గుర్తించి కార్డులను అందించడంతో పాటు సన్న బియ్యం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

భూపాలపల్లి రూరల్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలం ఆజాంనగర్, గొల్లబుద్దారం గ్రామాల్లో ఎమ్మెల్యే శుక్రవారం పర్యటించారు. ఆజాంనగర్‌లో రూ.10 లక్షలతో శివకేశవస్వామి దేవాలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గొల్లబుద్దారంలో రూ.50 లక్షలతో రామాలయంలో అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ఆలయాలను సీజీఎఫ్ నిధులతో అభివృద్ధి చేస్తానని అన్నారు. తాను చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. అనంతరం రామాలయంలో ఎమ్మెల్యే మొక్కను నాటి నీరు పోశారు.

హామీలను నెరవేర్చాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏటూరునాగారు: ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేష్, ఎంఎస్‌పీ నాయకుడు తడుగుల విజయ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో దివ్యాంగుల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు వెంటనే రాజకీయ రిజర్వేషన్ ప్రకటిస్తూ చట్ట సవరణ ఆర్డినెన్స్ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ బాబు, మోహన్‌రావు, ఎంపెల్లి శంకర్, గార మల్లయ్య, ఆత్మూర్ లక్ష్మయ్య, మామిడాల మహేష్, దాసరి భిక్షపతి, గడదాసు సతీష్ పాల్గొన్నారు.

లారీలు నిలపకుండా చర్య తీసుకోవాలి

వెంకటాపురం(కె): మండలంలో రోడ్డుకు ఇరువైపులా ఇసుక లారీలు నిలపకుండా చర్య తీసుకోవాలని టీడీపీ మండల నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకుడు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. మండల పరిధిలోని పాత్రాపురం నుంచి ఎదిర వరకు రోడ్డుకు ఇరువైపులా ఇసుక లారీలను నిలపడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకులు అత్మకూరి పట్టాభి, రామారావు, అమీర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు



యువకులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

- ఎస్సై కృష్ణప్రసాద్

వాజేడు: యువత అసాంఘిక శక్తులకు సహకరించొద్దని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పేరూరులో అభయమిత్ర కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శుక్రవారం పలు గ్రామాలకు చెందిన యువకులతో మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నతంగా ఎదగాలని అన్నారు. గంజాయి అమ్మడం, సేవించడం చేయొద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించొద్దని చెప్పారు. అమ్మాయిలు, మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించొద్దని అవగాహన కల్పించారు. అనంతరం యువకులకు వాలీబాల్ కిట్లను అందించారు.

విద్యార్థులకు షూ, బెల్టుల పంపిణీ



షూ, బెల్టు అందజేస్తున్న ఎంఈఓ దేవనాయక్

భూపాలపల్లి అర్బన్: మండలంలోని పుల్లూరిరామయ్యపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు షూ, టై, బెల్టులు శుక్రవారం అందజేశారు. పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు రామయ్య, హిమబిందు, సుజాత కలిసి సొంత ఖర్చులతో షూ, టై, బెల్టులు కొనుగోలు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి దేవనాయక్ హాజరై ఉపాధ్యాయులను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు రషీద్, ఉపాధ్యాయులు సమ్మయ్య, శ్రీనివాస్, కన్నయ్య, రజిత, రాజు, కవిత పాల్గొన్నారు.

ఒకరి అరెస్ట్

ములుగు రూరల్: మండలంలోని ఇంచర్లకు రవి మృతికి కారణమైన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇంచర్లకు చెందిన మహమ్మద్ గౌస్ ఏర్పాటు చేసి ఎలక్ట్రికల్ ఫెన్సింగ్‌కు రవి తగిలి షాక్ గురై మృతి చెందాడు. దీంతో మహమ్మద్ గౌస్ అలియాస్ రెహమాన్ ఖాన్‌ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు పంపించారు.

సైకిల్ బహూకరణ



సైకిల్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన పేద విద్యార్థిని బబులోజు భవాని జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతుంది. ఇంటి నుంచి స్కూల్‌కు రావడానికి ఇబ్బంది పడుతుండడంతో 1992–93 పదో తరగతి పూర్వ విద్యార్థులు భవానికి రూ.5500ల విలువ చేసే సైకిల్‌ను శుక్రవారం బహూకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సప్పిడి రాము, కొట్టె పాపారావు, ముక్కెర లాలయ్య, పాస్టర్ పైడిపల్లి ఎల్లేష్, ముక్కెర చిన్న లాలయ్య, సురేష్, మనగాని రాజు పాల్గొన్నారు.